ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 10-12.2025 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్ర ప్రభుత్వం వెయ్యి కోట్ల రూపాయలతో ఏర్పాటు చేసే స్టార్టప్ ఫండ్ ను యువ పారిశ్రామికవేత్తలు వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

2. హైదరాబాద్ సమీపంలోని ఫ్యూచర్ సిటిలో రెండు రోజుల పాటు నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ లో సుమారు 5 లక్షల 75 వేల కోట్ల రూపాయల పెట్టుబడులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో ఎంవోయు లు కుదిరాయి.

3. గ్లోబల్ సమ్మిట్ లో మూడు వేల డ్రోన్లతో నిర్వహించిన ప్రదర్శన గిన్నిస్ రికార్డ్ సృష్టించింది.

4. కాలుష్యం నుంచి హైదరాబాద్ ను రక్షించే ఉద్దేశ్యంతో ఈవి పాలసీ, స్క్రాప్ పాలసీని తీసుకొచ్చినట్లు రాష్ట్ర రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు.

------------------------------------

**గూగుల్**

రెండు దశాబ్దాల క్రితం ప్రారంభించిన అనేక స్టార్ట్ అప్ కంపెనీలు నేడు బిలియన్ల డాలర్ల కంపెనీలుగా ఎదిగాయని.. గూగుల్, యాపిల్, అమెజాన్, టెస్లా, ఫేస్‌బుక్ వంటివి వీటికి గొప్ప ఉదాహరణలు అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ లోని టి హబ్ లో గూగుల్ స్టార్టప్ హబ్ ను కొద్ది సేపటి క్రితం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... హైదరాబాద్ నుంచి కనీసం 100 స్టార్టప్ లు

యూనికార్న్స్ కంపెనీలుగా ఎదగాలని ఆశిస్తున్నానన్నారు. ప్రభుత్వం 1000 కోట్ల రూపాయలతో స్టార్ట్ అప్ ఫండ్ ఏర్పాటు చేస్తుందని, ఆ ఫండ్ ను యువపారిశ్రామిక వేత్తలు వినియోగించుకోవాలని సూచించారు.

బైట్ - రేవంత్ రెడ్డి

జీఎస్

-----------------------------

**ప్రముఖులు**

తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ లక్ష్యాన్ని చేరుకోవడమే కాకుండా, అభివృద్ధి నమూనాలో ప్రపంచానికే ఆదర్శంగా నిలిచే అవకాశం ఉందని పలువురు జాతీయ, అంతర్జాతీయ ఆర్థికవేత్తలు అభిప్రాయపడ్డారు. ప్రపంచం కూడా తెలంగాణ నమూనాను అనుసరించాల్సి వస్తుందన్నారు. తెలంగాణ అన్‌స్టాపబుల్ మాత్రమే కాదని, అన్‌బీటబుల్‌గా ఉంటుందని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం నడుస్తున్న మార్గం చూస్తుంటే వచ్చే దశాబ్దం నాటికి ట్రిలియన్ డాలర్ ఎకానమీకి, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థకు చేరుకోవడం అసాధ్యమేమీ కాదనిపిస్తోందని చెప్పారు. నిన్న రాత్రి జరిగిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ముగింపు సభలో ప్రముఖ పారిశ్రామిక వేత్త ఆనంద్ మహీంద్ర, ఆర్బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు, కేంద్ర ప్రభుత్వ మాజీ ఆర్థిక సలహాదారు, అరవింద్ సుబ్రహ్మణ్యన్, నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్ సుమన్‌బేరీ, కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్, మురళీధరన్ పాల్గొనగా.. బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్, రిజర్వ్ బ్యాంకు మాజీ గవర్నర్ రఘురాం రాజన్‌లు ఆన్‌లైన్‌లో మాట్లాడారు.

జీఎస్

---------------------------------

**రేవంత్ రెడ్డి**

రాష్ట్రంలో పేదరికం, జాతివివక్షను దూరం చేసేందుకు, అందరికీ విద్య, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. గ్లోబల్ సమిట్ ముగింపు కార్యక్రమంలో తెలంగాణ విజన్ డాక్యుమెంట్-2047 విడుదల చేసిన అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఈ దార్శనిక పత్రం రాష్ట్ర భవిష్యత్తుకు రోడ్‌మ్యాప్ అన్నారు. పేదల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందని, సమాజంలో మిగతావారితో సమానంగా వారిని వృద్ధిలోకి తీసుకొచ్చేందుకు సంక్షేమంపై నిధులు ఖర్చుచేస్తామని స్పష్టం చేశారు. ఈ దార్శనిక పత్రం రైతులు, మహిళలు, యువత సమస్యలు, ఆకాంక్షలకు పరిష్కారం చూపిస్తుందన్నారు.

జీఎస్

---------------------------

**భట్టి**

తెలంగాణ విజన్ డాక్యుమెంట్-2047తో తెలంగాణ సమగ్రాభివృద్ధి ఆవిష్కృతమవుతుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. గ్లోబల్ సమిట్ ముగింపు సభలో ఆయన మాట్లాడుతూ.. ఈ దార్శనిక పత్రం రాష్ట్రాభివృద్ధికి లక్ష్యాలను నిర్వచిస్తూ, సమగ్ర వృద్ధికి దారితీసే మార్గదర్శిగా నిలుస్తుందని అన్నారు. ఈ సమిట్‌లో ప్రతి సెషన్ సరికొత్త అవకాశాలను తెరిచిందన్నారు. సహజ వనరులు, సాంకేతిక శక్తి, ప్రజల ప్రతిభ ఇవే మనకు బలమన్నారు. రాష్ట్ర అభివృద్ధి లక్ష్య సాధనలో ప్రతి తెలంగాణ పౌరుడు భాగస్వామి కావాలని, భవిష్యత్తు తరాలు నడిచే మార్గాన్ని ప్రజలే నిర్మించాలని ఆకాంక్షించారు.

జీఎస్

-----------------------------------

**పెట్టుబడులు**

హైదరాబాద్ సమీపంలోని ఫ్యూచర్ సిటీలో రెండు రోజుల పాటు నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్‌లో 5 లక్షల 75 వేల కోట్ల రూపాయల పెట్టుబడులకు సంబంధించి ఎంవోయూలు కుదిరాయి. మొదటి రోజు సదస్సులో 3 లక్షల 97 వేల 500 కోట్ల రూపాయల

విలువైన ఒప్పందాలు కుదరగా.. రెండోరోజు ఒక లక్షా 77 వేల 500 కోట్ల రూపాయల విలువైన ఒప్పందాలను ప్రభుత్వంతో వివిధ కంపెనీలు కుదుర్చుకున్నాయి. తెలంగాణ పర్యాటక రంగంలో 7 వేల 45 కోట్ల రూపాయల విలువైన పెట్టుబడులపై ఒప్పందాలు జరిగాయి. వీటితో ప్రత్యక్షంగా 10వేల మందికి, పరోక్షంగా 30 వేల మందికి ఉపాధి లభించనుంది.

జీఎస్

----------------------------

**ఆర్పీఎఫ్**

రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ 26వ అఖిల భారత పోలీస్ బ్యాండ్ పోటీలు ఈనెల 16 నుంచి 20వ తేదీ వరకు సికింద్రాబాద్ మౌలాలిలోని ఆర్పీఎఫ్ శిక్షణా కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు ఆర్పీఎఫ్ డీఐజీ, నోడల్ అధికారి షాదాన్ జెబ్ ఖాన్ ఒక ప్రకటనలో తెలియజేశారు. జాతీయ స్థాయిలో జరిగే ఈ ప్రతిష్టాత్మక ఈ పోటీలో లో వివిధ రాష్ట్రాల పోలీసు విభాగాలు, కేంద్ర సాయుధ పోలీసు దళాలకు చెందిన దాదాపు 1300 మంది సిబ్బందితో కూడిన 24 పోలీస్ బ్యాండ్ బృందాలు పాల్గొంటాయని వివరించారు. ఈ పోటీల్లో భాగంగా ఈనెల 17వ తేదీ సాయంత్రం చార్మినార్ దగ్గర, 18వ తేదీ సాయంత్రం నెక్లెస్ రోడ్ లోని అంబేద్కర్ విగ్రహం దగ్గర ప్రదర్శనలు జరుగుతాయన్నారు. అఖిల భారత పోలీస్ బ్యాండ్ పోటీ గురించి ప్రజలకు అవగాహన కల్పించడం, పోలీస్ బ్యాండ్ల సంగీత నైపుణ్యం, క్రమశిక్షణ, నైపుణ్యాన్ని బహిరంగంగా ప్రదర్శించడమే లక్ష్యంగా ఈ ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు నోడల్ అధికారి వెల్లడించారు.

పీఎన్

------------------------

**తైవాన్**

హైదరాబాద్ లోని టీ-వర్క్స్ లో ఈ ఉదయం తైవాన్ జాబ్ మేళాను ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఈ మేళాలో రాష్ట్రంలోని 20 ఇంజినీరింగ్ కాలేజీల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో ఆరు తైవాన్ కంపెనీలు.. ప్రతిభ కలిగిన విద్యార్థులను

తమ సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపిక చేస్తాయి. ఎంపికైన వారికి శిక్షణ ఇచ్చి తైవాన్ లో ఉద్యోగావకాశాలు కల్పించనున్నాయి.

జీఎస్

-----------------------

**బస్సులు**

దేశంలోనే తొలిసారి మన రాష్ట్రంలో ఆర్టీసీ బస్సులకు మహిళా సంఘాల సభ్యులను యజమానులను చేసినట్లు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. సికింద్రాబాద్ లోని రాణిగంజ్ ఆర్టీసీ డిపోలో ఈ ఉదయం 65 ఎలక్ట్రిక్ బస్సులను మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలుష్యం నగరాన్ని ముంచెత్తకుండా రవాణా శాఖ ఈవీ విధానం , స్క్రాప్ విధానాలను తీసుకొచ్చిందన్నారు. ఆర్టీసీ సంస్థ పరిరక్షణ ,ఉద్యోగుల సంక్షేమం, ప్రయాణికుల భద్రత దృష్టిలో పెట్టుకున్నామని చెప్పారు. ప్రయాణికులకు సౌకర్యంగా ఈవీ బస్సులను మేడారం సమ్మక్క జాతర, శ్రీశైలం, యాదాద్రిలకు నడుపుతున్నామన్నారు.

జీఎస్

-----------------------

**డ్రోన్లు**

గ్లోబల్ సమిట్ వేదికగా అత్యధిక డ్రోన్లతో నిర్వహించిన ప్రదర్శన గిన్నిస్ బుక్ రికార్డు సృష్టించింది. నిన్న రాత్రి ఫ్యూచర్ సిటీ ప్రాంతంలో ఆకాశంలో 3 వేల డ్రోన్లతో 'తెలంగాణ ఈజ్ రైజింగ్. కమ్ జాయిన్ ద రైజ్' అనే అక్షరాలను ప్రదర్శించారు. గిన్నిస్ ప్రతినిధులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి దీనికి సంబంధించిన ధ్రువపత్రాన్ని అందజేశారు. ఇప్పటివరకు అత్యధిక డ్రోన్ల ప్రదర్శన రికార్డు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ అబుదాబి పేరున ఉంది. 2025 నూతన సంవత్సర వేడుకల సందర్భంగా 2 వేల 131 డ్రోన్లతో 'హ్యాపీ న్యూ ఇయర్' అనే అక్షరాలను ప్రదర్శించడం ద్వారా ఆ దేశం రికార్డు నెలకొల్పింది.

జీఎస్

------------------------------

**హరీష్ రావు**

తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన విజన్ డాక్యుమెంట్ లో విజన్ లేదని, దాన్ని చేరుకునే మిషన్ లేదని, అది విజన్ లెస్ డాక్యుమెంట్ అని భారత రాష్ట్ర సమితి శాసన సభ్యులు హరీష్ రావు ఆరోపించారు. కోట్ల రూపాయలు ఖర్చు చేసి నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ లో పెట్టుబడులకు సంబంధించి కట్టుకథలు చెప్పారని విమర్శించారు.

పీఎన్

--------------------------

**షెడ్యూల్**

రాష్ట్రంలో పదోతరగతి వార్షిక పరీక్షలు మార్చి 14వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ 13న ముగుస్తాయి. ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకుడు పీపీ శ్రీహరి షెడ్యూల్‌ను నిన్న విడుదల చేశారు. గత విద్యా సంవత్సరం మాదిరిగా ఒక్కో సబ్జెక్టుకు 20 ఇంటర్నల్ మార్కులతో పాటు సబ్జెక్టుల వారీగా గ్రేడింగ్ ఇస్తారు.

జీఎస్

-------------------------